క్లుప్తంగా

ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రజలు ఆరోగ్య విషయాలపై అప్రమత్తంగా ఉండాలని గోస్పాడు వైద్యాధికారి కాంతారావునాయక్ అన్నారు. శనివారం గోస్పాడులో పర్యటించి సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో వైద్యసేవలు అందించాలన్నారు. వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణ ఆపాలి

నంద్యాల(న్యూటౌన్): రైల్వే ప్రైవేటీకరణను ఆపాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నంద్యాల రైల్వే స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, గౌస్ మాట్లాడుతూ రైల్వే కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, రైల్వే స్టేషన్లను పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు అప్పగించరాదన్నారు. రైల్వే గూడ్స్ షెడ్‌లో పని చేసే హమాలీలలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటలింగం, రైల్వే హమాలీ నాయకులు మాదన్న, పెద్దన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపులుల సంరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు

రుద్రవరం: పెద్ద పులుల సంరక్షణ అందరి బాధ్యత అని రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా స్థానిక అటవీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఆయన మొక్కలు నాటారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మూడు రోజుల నుంచి రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లోని పలు గ్రామాల్లో పెద్ద పులుల సంరక్షణ, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పలు అంశాలపై ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. గెలుపొందిన వారికి నంద్యాల డీఎఫ్ఓ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ శ్రీనివాసరెడ్డి, ఎఫ్‌బీఓ సురేంద్ర గౌడ్ తదితరులు ఉన్నారు.

నూతన విద్యావిధానంపై అవగాహన


నూతన విద్యావిధానంపై అవగాహన కల్పిస్తున్న రామకృష్ణారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): డిగ్రీ కళాశాలలో ప్రవేశ పెట్టిన నాలుగు సంవత్సరాల నూతన విద్యావిధానంపై అవగాహన సదస్సును శనివారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఐక్యూఏసీ మేజర్ సబ్జెక్ట్ అంశంపై ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సురేష్, అధ్యాపక సిబ్బందికి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్‌సీహెచ్ఈ వారు ప్రవేశ పెట్టిన హానర్స్ డిగ్రీ నాలుగు సంవత్సరాల కోర్సు గురించి వివరించారు. విద్యా విధానంలో భారతీయ విద్యా చరిత్రకు, సంస్కృతం, కళలు, యోగా వంటి అంశాలకు పెద్దపీట వేశారన్నారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జగనన్న సరక్ష


యర్రగుంట్లలో ధ్రువపత్రాలను అందజేస్తున్న సర్పంచులు

శిరివెళ్ల: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక 4వ గ్రామ సచివాలయం, యర్రగుంట్ల 2వ సచివాలయాలలో సర్పంచులు సాలమ్మ, అయ్యలూరి సుభాన్, కందుల మల్లేశ్వరి లబ్ధిదారులకు 1573 కుల, ఆదాయ, కౌలు రైతు గుర్తింపు కార్డులు అందజేశారు. గ్రామ సచివాలయ వైద్య సిబ్బంది వైద్య శిబిరాలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఉప సర్పంచు ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

■ వడ్డీలేకుండా రుణం ఇచ్చారు



ఇక్కడ పండ్లు అమ్ముతున్న ఈమె భాగ్యలక్ష్మి. ఆళ్లగడ్డ పాత బస్టాండ్ సెంటర్‌లో వ్యాపారం నిర్వహిస్తుంది. ఈమె గతంలో పెట్టుబడికి ప్రైవేటు వ్యక్తుల దగ్గర డబ్బులు తీసుకుంటే వడ్డీలు కట్టెందుకే సరిపోయేదని చెబుతోంది. ఇప్పుడు వడ్డీ లేకుండా ప్రభుత్వం ఇస్తున్న 'జగనన్న తోడు' రుణం ఎంతో ఉపయోగపడుతోందని హర్షం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికి ఆరు సార్లు రుణం తీసుకోవడం జరిగిందని, ఇంత మంచి చేస్తున్న జగనన్న రుణం తీర్చుకోలేనిదని భాగ్యలక్ష్మి చెబుతోంది.

■ వడ్డీల బాధ తప్పింది



బంకులో కూర్చుని వ్యాపారం చేస్తున్న ఈమె పేరు నాగమ్మ. సుమారుగా పది సంవత్సరాల నుంచి ఇంటి ముందు బంకు వేసుకుని వ్యాపారం చేసుకుంటోంది. అయితే ఎప్పుడు సరుకులు తెచ్చుకోవాలన్నా వడ్డీకి తీసుకోక తప్పేది కాదు. దీంతో వచ్చే ఆదాయం అంతా వడ్డీలకు చెల్లించెందుకే సరిపోయేదని, ఇప్పుడు మూడేళ్లుగా వడ్డీ లేకుండా ఇస్తున్న రుణం తీసుకుంటూ వ్యాపారం చేసుకుంటున్నానని చెబుతోంది. అన్ని సార్లూ వడ్డీ మొత్తం జగనన్నే కడుతున్నారని, మాలాంటి పేదవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందోని నాగమ్మ సంతోషంగా చెబుతున్నారు.

■ ఆపదకాలంలో జగనన్న చేదోడు



పట్టణంలోని కర్ణమయ్య వీధిలో విసనకర్రలు, చాటలు తయారు చేస్తున్న ఈమె పద్మావతి. కుల వృత్తే జీవనాధారం. అయితే కుల వృత్తికి అవసరమైన వెదుర్లు, రంగులు కొనుగోలు చేయాలంటే వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు చేయక తప్పేది కాదు. చేసిన విసనకర్రలు, చాటలు అమ్ముకుని వడ్డీ కట్టేసరికే సరిపోయేది. మళ్లీ సరుకులు తెచ్చుకోవాలంటే మళ్లీ వారినే ఆశ్రయించక తప్పేది కాదు. ఇలా ప్రతి సారి ఎంతో ఇబ్బంది పడేవారమని ఇప్పుడు మూడేళ్లుగా ఐదు దఫాలుగా 'జగనన్న తోడు' తమకు చేదోడుగా ఉంటోందని పద్మావతి ఆనందం వ్యక్తం చేస్తోంది.

చితికిన బతుకులకు ఆర్థిక 'తోడు'

- 'జగనన్న తోడు'తో చిరువ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు
- ఎటువంటి పూచీ లేకుండా రూ. 10 వేలు లోన్
- ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రెండు సార్లు సున్నావడ్డీ జమ చేస్తున్న సీఎం
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 3,207 మందికి లబ్ధి


తోపుడు బండ్లపై వ్యాపారం నిర్వహించుకుంటున్న చిరు వ్యాపారులు

నియోజకవర్గంలో ఏడో విడతగా విడుదలైన వడ్డీ రాయితీ వివరాలు

మండలం	లబ్ధిదారులు	వడ్డీ రాయితీ (రూపాయల్లో)
ఆళ్లగడ్డ	324	84,012
దొర్నిపాడు	216	56,145
చాగలమర్రి	436	1,13,086
శిరివెళ్ల	489	1,26,888
ఉయ్యాలవాడ	220	57,023
రుద్రవరం	413	1,07,068
ఆళ్లగడ్డ టౌన్	695	1,80,205
మొత్తం	2,793	7,24,427

ఆళ్లగడ్డ: పొట్ట చేతపట్టుకుని చేస్తున్న వ్యాపారం సరిగ్గా జరగక.. చేసే ఆ చిరువ్యాపారానికి బయట అప్పులు ఇచ్చేవారు దొరక్క... ఇచ్చినా వారం, రోజు వడ్డీల చెల్లించేలేక చితికి పోతున్న చిరువ్యాపారులకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సాంత్వన అందిస్తోంది. తోపుడు బండ్లపైన, వీధుల్లో చిరు వ్యాపారం చేసుకునే వారు, చేతి వృత్తులు, కుల వృత్తులతో కుటుంబాలను పోషించుకుంటున్న వారికి 'జగనన్న తోడు' పథకం కింద ప్రభుత్వం వడ్డీ లేకుండా, పూచీ లేకుండా ప్రతి ఆరు మాసాలకు ఒకసారి రూ. 10 వేల చొప్పున రుణం అందజేస్తోంది. ఇప్పటికి వరుసగా ఏడు దఫాలుగా రుణం అందుకున్న లబ్ధిదారులు కష్టకాలంలో అందిస్తున్న ఈ సాయం.. తమ బతుకు బండికి ఇంధనంలా ఉపయోగపడుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏడో విడత జమ అయిన సున్నా వడ్డీ రూ.7,24,427

నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికి వరుసగా ఏడు సార్లు 'జగనన్న తోడు' పథకం కింద 3,207 మంది లబ్ధి పొందుతున్నారు. ఏడో విడతలో 2,793 మంది అప్పుగా తీసుకున్న రూ 10 వేలు విడతల వారీగా ఆరు నెలల్లోపు బ్యాంకుల్లో చెల్లించారు. దీంతో ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం వారి తరుఫున రూ7,24,427 వడ్డీని లబ్ధిదారుల ఖాతల్లో జమ చేయడం జరిగింది. ఈ వడ్డీని లబ్ధిదారులు బ్యాంకులకు చెల్లించి రుణం మొత్తం చెల్లు బెట్టుకుంటున్నారు

మహిళల పురోగతికి దోహదం



చిరువ్యాపారులు, కుల, చేతి వృత్తులతో జీవనం సాగించేవారు పురోగతి సాధించాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'జగనన్న తోడు' పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాం. అవసరమైన అర్హులైన వారికి వడ్డీ లేకుండా రుణం అందజేస్తున్నాం. 'జగనన్న తోడు' రుణం లబ్ధిదారుల ఆర్థిక ఎదుగుదలకు దోహదపడుతోంది.
– శ్రీధర్‌రెడ్డి – పీడీ, డీఆర్‌డీఏ

సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు వార్డులలో నెలకొన్న పారిశుద్ధ్య, డ్రైన్ల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్బీఐ కాలనీ, పద్మావతి నగర్‌లలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య పనులలో అలసత్వం వీడాలన్నారు. రోడ్లు, డ్రైన్లలో పూడికలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అనంతరం పద్మావతినగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యత లోపించరాదని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో జరుగుతున్న అవినీతిపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని, అందుకు బాధ్యులైన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మోట రాముడు అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవినీతి తిమింగలాలు ఉన్నాయని వాటిని వదిలేసి, చిన్న చేపను పట్టుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న పాల్గొన్నారు.

వరద రాజస్వామి ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల నిలిపివేత

ఆత్మకూరు: మండల పరిధిలోని వరద రాజస్వామి ప్రాజెక్ట్ నుంచి సాగునీటి విడుదలను నిలిపివేసినట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ నాగన్న తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నల్లమలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 20 ఏళ్లలో తొలిసారిగా జూలై నెలలో ప్రాజెక్ట్ నిండి భారీగా నీరు వచ్చి చేరడంతో 400 క్యూసెక్కుల నీటిని పంట కాల్వలకు, చెరువులకు విడుదల చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం వర్షాలతో పాటు నల్లమలలో ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కూడా లేకపోవడంతో చెరువులకు విడుదల చేస్తున్న నీటిని నిలిపివేసినట్లు చెప్పారు. మళ్లీ రైతులకు అవసరం అయినప్పుడు ప్రాజెక్ట్ నీటిని విడుదల చేస్తామని చెప్పారు.

శతావధాన పద్య సంపుటి ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ పోచా

నంద్యాల(వ్యవసాయం): చిన్నయసూరి సాహితీ సమితి నంద్యాల ఆధ్వర్యంలో ప్రచురించిన శతావధాన పద్య సంపుటిని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ తెలుగు సాహితీ ప్రక్రియలో అవధానం విశిష్టమైనదన్నారు. సాహితీ ప్రియులకు అవధానం ఒక సారస్వత వినోదమని తెలుగు వారికే సొంతమైన అవధానానికి ఆదరణ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ రమణమూర్తి సంపాదకత్వంలో రూపొందిన శతావధాని శ్రీ వద్దిపర్తి పద్మాకర్ 14వ శతావధాన పద్య పుస్తకం పాఠకులను అలరిస్తుంది. భావితరాలకు అవధాన ప్రక్రియను పరిచయం చేయడానికి చిన్నయసూరి సాహితీ సమితి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సాహితీ సంస్థ ప్రతినిధులు శేషఫణి, వెంకటేశ్వర్లు, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు చేశారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్యలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

'సురక్ష'తో ప్రజలకు సత్వర సేవలు


యాళ్లూరులో ధ్రువపత్రాలను అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అప్పటికప్పుడే అందజేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. మండలంలోని యాళ్లూరు-2 సచివాలయ పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకాలు అందించాలని ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రజల అవసరాల నిమిత్తం వారి సమస్యలు పరిష్కారానికి అధికారులే గ్రామాలకు వచ్చి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అక్కడికి అక్కడే రూపాయి ఖర్చు లేకుండా అందజేస్తున్నారని తెలిపారు. 770 మందికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారావు, సర్పంచ్ రత్నమ్మ, ఉప సర్పంచ్ బొక్కెం నాగేశ్వరరెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్‌ను' జయప్రదం చేయండి

మహానంది: హైదరాబాద్ లో ఆగస్టు 2వ వారంలో నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ పూల వెంకటసుబ్బన్న, జిల్లా నాయకులు గాజులపల్లె నరసింహ కోరారు. గోపవరం గ్రామంలో శనివారం ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల కన్వీనర్ చెవుల వెంకటసుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

శ్రీమద్దిలేటి నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాస శనివారం భక్తులు స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవల ద్వారా రూ.5,75,742 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. ఆలయాభివృద్ధికి ప్రకాశం జిల్లా, గిద్దలూరుకు చెందిన చౌడ బోయిన మద్దిలేటి జ్ఞాపకార్థం కొడుకు వెంకటరమణ, విజయలక్ష్మి దంపతులు రూ.55,116, నంద్యాల మండలం, పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, మంజులాదేవి దంపతులు రూ.50,116 విరాళంగా అందజేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

- వైభవంగా పీర్ల ఊరేగింపు
- జలధితో ముగిసిన వేడుకలు


నంద్యాల పెద్ద బండలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


చాగలమర్రిలో అశేష భక్త జనజనం మధ్య లాల్‌స్వామి ఊరేగింపు దృశ్యం


చాగలమర్రిలో భక్తులకు పంచేందుకు గంధం, చక్కెర, పప్పులు, కొబ్బెరతో వడి కట్టుకున్న భక్తులు


కల్పనా సెంటర్‌లో బీబీ ఫాతిమా పీరును ఊరేగిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మొహర్రం వేడుకలను మతసామర్యానికి ప్రతీకగా అన్ని మతాల వారు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం పీర్లను జలధి (షహదత్) చేశారు. పట్టణంలో దాదాపు 25కు పైగా పీర్ల మాకానాలు ఏర్పాటు చేసి పీర్లను కొలువు చేసి పది రోజులుగా భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ఆధ్యాత్మిక గ్రంథాల పారాయణం చేపట్టారు. చివరి రోజైన శనివారం ఉదయాన్నే పీర్ల గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం తిరిగి మకానాలకు చేరుకొని సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక చింతనతో, ఉపవాసాలతో జలధి కార్యక్రమాన్ని మేళతాళాలతో తీసుకొని వచ్చారు. కల్పనాసెంటర్‌లోని ఇమామ్‌కాశీం, చాంద్‌బాడలో అలిఅక్బార్, ఇమామ్‌కాశీం, అలీఅబ్బాస్, మాల్దారిపేటలో మౌలాలిస్వామి, తొట్టిబావి వద్ద ఉన్న ఉజాలాతాబుచ్, గాంధీచౌక్‌లో హసన్, జమా ల్ బాషా దర్గా వద్ద ఉన్న అలీఅక్బర్, అలీఅక్షర్, బాదుల్ సాహెబ్, సాదిక్‌నగర్‌లోని అలీఅక్బార్, హసన్ హలీమ్, నూనెపల్లెలోని మౌలాలిస్వామి, ఏకల్యవనగర్‌లోని దస్తగిరి స్వాములకు ముజావర్లు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా జలధికి తీసుకెళ్లారు. యువకులు గంధం చల్లుకుంటూ మాతం నిర్వహించారు. పురవీధుల గుండా భక్తులు స్వామి వారికి పూలహారాలు, బాసికాలు, టెంకాయలు, మలీదా వంటి ప్రసాదాలను సమర్పించారు. పీర్ల ఊరేగింపు కల్పనాసెంటర్ వద్ద చేరుకొని గాంధీచౌక్, బంగారు అంగళ్లు, పెద్దబండ, ఆర్టీసీ బస్టాండ్, చివరగా రాత్రి 7గంటల వరకు గ్రామోత్సవం నిర్వహించి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న కుందూనదిలో పీర్లను జలధి(షహదత్) చేశారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

గ్రామాల్లో పీర్ల గ్రామోత్సవం

నంద్యాల(అర్బన్): మొహర్రంను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలో పీర్ల గ్రామోత్సవాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. పోలూరు, భీమవరం, పులిమద్ది, కొత్తపల్లె, పెద్ద కొట్టాల, అయ్యలూరు, కానాల, చాపిరేవుల, పుసులూరు, తదితర గ్రామాలలో కుల మతాలకు అతీతంగా వేడుకలలో పాల్గొన్నారు. శనివారం ఆయా గ్రామాలలోని పీర్లను నిమజ్జనం చేశారు.

ఘనంగా పీర్ల నిమజ్జనం

గోస్పాడు: మొహర్రం సందర్భంగా ఏర్పాటు చేసిన పీర్లను శనివారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పసురపాడు, యాళ్లూరు, జూలే పల్లె గ్రామాలలో ఏర్పాటు చేసిన పీర్లను గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. పీర్లకు నైవేద్యం సమర్పించడంతో పాటు గట్టాలు చల్లుతూ మొహర్రం వేడుక ప్రాముఖ్యతను చాటారు. అనంతరం ఆయా గ్రామాల్లోని కాల్వల వద్ద నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కులమతాలకు అతీతంగా..

దొర్నిపాడు: మండలంలో శనివారం మొహర్రం వేడుకలను కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చావిళ్లలో కొలువైన పీర్లకు ఫాతెహాలు సమర్పించి ఊరేగించారు. దొర్నిపాడు, క్రిష్టిపాడు, డబ్ల్యూగోవిందిన్నె, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె, గుండుపాపల డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో మొహర్రంను అత్యంత వైభవంగా జరుపుకున్నారు.

ముగిసిన వేడుకలు

రుద్రవరం: మండలంలో మొహర్రం వేడుకలు ముగిశాయి. 21 గ్రామపంచాయతీల పరిధిలోని చావిళ్ల లో కొలువు దీరిన పీర్లకు తొమ్మిది రోజుల పాటు ప్రజలు భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు సమర్పించారు. పదో రోజు శనివారం మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో పీర్లను గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామ శివారుల్లో ఉన్న బావులు, చెరువులు తదితర ప్రదేశాలకు పీర్లను తీసుకెళ్లి జలధి చేశారు.

ప్రశాంతంగా వేడుకలు

ఉయ్యాలవాడ : కులమతాలకతీతంగా జరుపుకునే మొహర్రం పండుగ వేడుకలు మండలంలో శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో 3 పీర్ల చావిళ్లలో, అల్లూరు, హరివరం, పుచ్చకాయలపల్లె, ఆర్.పాంపల్లె, రూపనగుడి, బోడెమ్మనూరు, తదితర గ్రామాలలో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక అలంకరణ గావించారు. శనివారం ఉయ్యాలవాడలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న గుమటాల(పల్లకీ)లో పీర్ల గ్రామోత్సవం నిర్వహిస్తూ కుందూనది వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్రీలాల్‌స్వామి ఊరేగింపు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో మొహర్రం పండుగ సందర్భంగా 10వ (షహదత్)రోజు చిన్నమకానంలో కొలువు దీరిన శ్రీలాల్ స్వామి ప్రధాన పీరు పగలు ఊరేగింపు శనివారం సంప్రదాయ మేళతాళాలతో వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3.00 గంటలకు చిన్నమకానం నుంచి లాల్‌స్వామి ఊరేగింపు ప్రారంభమై పుర వీధుల గుండా సాగి తిరిగి చిన్నమకానానికి చేరుకుంది. ఊరేగింపులో భక్తులు వారి ఇంటి వద్ద స్వామికి చోంగా రొట్టెలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. అలాగే కొంత మంది పాలు, పానకం పంచిపెట్టారు. భక్తులు గంధం పొడిని ఒకరినొకరు పూసుకుంటూ, చెక్కర, పప్పులు, కొబ్బెర తురుముతో వడులు కట్టి భక్తులకు పంచి పెట్టి మొక్కులను తీర్చుకున్నారు. లాల్‌స్వామి పగలు ఊరేగింపుతో చాగలమర్రిలో 10 రోజుల పాటు నిర్వహించిన మొహర్రం వేడుకలు పూర్తయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐలు రమణయ్య, తిరుపాల్, మౌలాబీ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడు ముల్లా జైలాబ్దిన్, ఉపాధ్యక్షుడు చక్రం షబ్బీర్, ప్రధాన కార్యదర్శి ముల్లా ఖాదర్‌బాషా, సంయుక్త కార్యదర్శి ముల్లా ఇబ్రహీం, కోశాధికారి, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, సభ్యులు షఫి, దాదాపీర్, రఫీద్దీన్‌ల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి


గోస్పాడులో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు


కానాలలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


ఉయ్యాలవాడలో పీర్ల గుమటాల ఊరేగింపు


క్రిష్టిపాడులో ఊరేగుతున్న పీర్లు


రుద్రవరంలో నిమజ్జనానికి వెళ్తున్న పీర్లు